ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశానికి 7న కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో గల భామిని, మెళియాపుట్టిలోని ఏకలవ్య పాఠశాలలో ప్రవేశానికి ఈనెల 7న కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటన తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరులోని పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో కౌన్సిలింగ్ నిర్వహించనున్నామన్నారు. 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు రెండో విడత కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని, ప్రవేశ పరీక్ష మెరిట్ మార్కులు ఆధారంగా కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కావున అర్హత గల విద్యార్థులు కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

వర్షాభావం

ఉమ్మడి జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. గత కొద్దిరోజులుగా ఎండలు తారెత్తిస్తున్నాయి. భూములు బీటలు వారుతున్నాయి. మరోవైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయం దాటిపోతోంది. ఈనేపథ్యంలో పంటల సాగు అదునుకోసం రైతులు ఎదురు చూస్తున్నారు. వరుణుడి కోసం కర్షకుల కళ్లు కడగండ్లు కాస్తున్నాయి.

- అదును కోసం అన్నదాత ఎదురు చూపు
- తారెత్తిస్తున్న ఎండలు
- బీటలు వారుతున్న భూములు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సాధారణంగా ఖరీఫ్ జూన్ రెండో వారం నుంచి ప్రారంభమౌతోంది. సరిగ్గా ఇదే సమయంలో రుతుపవనాలు వచ్చేవి. దీంతో, వరి నారు ముళ్ల సిద్ధం చేసుకోవడంతో ఖరీఫ్ పంటల సాగు మొదలవుతుంది. కానీ, ఈ ఏడాది సమయం గడుస్తున్నా రుతుపవనాలు రాలేదు. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 123.5 మిల్లీమీటర్లు కాగా, కురిసింది కేవలం 59.4 మి.మీ మాత్రమే. సీజన్ ప్రారంభమయ్యే నెలలోనే 51.9 మి.మీ వర్షపులోటు ఏర్పడింది. జులైలో 3వ తేదీ వరకు 17 మి.మీ. కురవాల్సివుండగా 15.8మి.మీ. మాత్రమే కురిసింది. సీజన్ ప్రారంభం నుంచి 3వ తేదీ వరకు పరిశీలిస్తే 46.5 మిల్లీమీటర్ల వర్షపు లోటు ఉంది. 3వ తేదీ సాయంత్రం పలుచోట్ల భారీ వర్షాలు కురిసినప్పటికీ లోటు వర్షపాతాన్ని భర్తీచేసే పరిస్థితి లేదు. మరోవైపు ఎండలు మెండుగా కాస్తుండడంతో సోమవారం కురిసే వర్షపునీరు ఆవిరైపోయే పరిస్థితి ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

వాస్తవానికి విజయనగరం - పార్వతీపురం మన్యం జిల్లాల్లో పెద్దగా సాగునీటి వనరులు లేవు. దీంతో, వర్షాధారంగానే పంటలు సాగవుతున్నాయి. ఇందులో ఖరీఫ్ పంటలు ప్రధానమైనవి. గత ఖరీఫ్‌లో 2,90,476 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది 3,03,102 ఎకరాల్లో సాగు కావచ్చని అధికారులు భావిస్తున్నారు. ఖరీఫ్ ప్రణాళిక ప్రకారం అత్యధికంగా 2,34,112 ఎకరాల్లో వరిసాగు కానుంది. జిల్లాలో అత్యంత ప్రధాన పంట వరి. మొక్కజొన్న 31,375 ఎకరాలు, నువ్వులు 18,305 ఎకరాలు, చెరకు 11,525 ఎకరాలు, పత్తి 5,105 ఎకరాలు, వేరుశనగ 868 ఎకరాలు, రాగులు 96 ఎకరాలు, మినుములు, పెసలు, కందులు తదితర అపరాలు 329 ఎకరాల్లో సాగవుతాయని అంచనా. కానీ, సాగునీరు లేక ఎదురు చూస్తున్నారు. తోటపల్లి ప్రాజెక్టు కింద సుమారు 2,35,000 ఎకరాల ఆయుకట్టు ఉన్నప్పటికీ స్ట్రక్చర్లు, పిల్లకాలువలు పూర్తికపోవడం, ప్రధాన కాలువల మెయింటినెన్స్ కూడా సరిగా లేకపోవడం వంటి కారణాల వల్ల 80వేల ఎకరాలకు మించి సాగునీరు అందించలేని పరిస్థితి. 40ఏళ్ల క్రితం 24వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో తలపెట్టిన జంఝావతి పాలకుల నిర్లక్ష్యం వల్ల 12వేల ఎకరాలకు సాగునీరు అందించే రబ్బరు డ్యాంకు పరిమితమైంది. కాలువల మెయింటినెన్స్ కోసం ఏటా రూ.కోట్ల జైకా నిధులు కొన్నేళ్లగా విడుదల అవుతున్నప్పటికీ దుర్వినియోగానికి పాల్పడడంతో లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందడంలేదు. ఈ ప్రాజెక్టు కింద ప్రస్తుతం 6వేల ఎరాలకు సాగునీరు అందుతుందని అధికారులు లెక్కలు చూపుతున్నప్పటికీ ఆచరణలో అందులో సగం మేరకే నీటి పంపిణీ జరుగుతోంది. ఒడిశాతో నెలకున్న చిన్నపాటి వివాదం పరిష్కరించి సాగునీరు అందించడంలో గతంలో కాంగ్రెస్, ఆ తరువాత టిడిపి, నేడు వైసిపి ప్రభుత్వాలు కూడా విఫలమయ్యాయి. దీని తరువాత అంతటి ప్రతిష్టాత్మకంగా చంపావతి నదిపై తలపెట్టిన తారకరామతీర్థసాగర్ పనులు కూడా అసంపూర్తిగానే ఉన్నాయి. సుమారు 18ఏళ్లు కావస్తున్నా చుక్కనీరు అందించలేని పరిస్థితి. ఇక పెద్దగెడ్డ, ఆంద్ర, తాటిపూడి, పెదంకలాం, వట్టిగెడ్డ తదితర జలాశయాల పరిధిలో కూడా శివారు ఆయుకట్టుకు నీరు అందించలేని పరిస్థితి. గుర్లగెడ్డ జలాశయాన్ని పాలకులు పూర్తిగా విస్మరించారు. వీటన్నింటినీ ఆధునీకరించడం, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయడంతో పాటు పలుచోట్ల మినీ జలాశయాల నిర్మాణానికి నిధులు కేటాయించాలంటూ సిపిఎం, ఎపి రైతు సంఘాలు చాలా కాలంలో డిమాండ్ చేస్తున్నప్పటికీ పాలకులకు పట్టడం లేదు. ఇంకోవైపు పోలవరం కాలువ ద్వారా తలపెట్టిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి కూడా అతీగతీ లేదు. ఈనేపథ్యంలో జిల్లాలో మొత్తం వ్యవసాయ కేవలం వరుణుడి కరుణపైనే ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది.

గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న భారీ వర్షం

కురిసిన వర్షం... రైతుల హర్షం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో గత పది రోజులుగా మండే ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం లభించింది. గుమ్మలక్ష్మీపురంతో పాటు సీతంపేట, వీరఘట్టంలో సుమారు గంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. మరోవైపు ఖరీఫ్ సీజన్ కు వేసిన నారుమడి ఎండలకు ఎండిపోతున్న సమయంలో ఈ వర్షంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. పొలాల్లోనూ, చెరువుల్లో నీరు చేరడంతో కొంత ఊరట లభించినట్టయింది. మరో రెండు, మూడు రోజుల పాటు వర్షాలు కురిస్తే పొలం పనులు ప్రారంభించడానికి అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

సీతంపేట : మండలంలో గత వారం రోజులుగా ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఊరట చెందారు. మరో పక్క ఖరీఫ్ పనులు ప్రారంభించేందుకు వర్షం కోసం ఎదురు చూస్తున్న అన్నదాతకు ఈ వర్షం ఊరటనిచ్చింది. గంటసేపు ఏకధాటిగా కుండపోత వర్షం కురియంతో అటు ప్రజలు, ఇటు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీరఘట్టం : మండలంలోని సోమవారం వర్షం కురిసింది. గతవారం రోజులుగా ఎండ వేడిమి తట్టుకోలేక అల్లాడిపోతున్న తరుణంలో వర్షం కురవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షం పడడంతో నారు మడులకు ఊపిరి పోసినట్లు అయిందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న బాధితులు

ధ్రువపత్రాలు అందజేయాలి : కలెక్టర్

'జగనన్నకు చెబుదాం'కు 117 వినతులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను అందించాలని, తద్వారా ప్రజలకు ఏడాది వరకు ధ్రువపత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం ఉండదని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావుతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు విజయవంతంగా నిర్వహించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించే గ్రామాల్లో అందజేయాల్సిన సర్టిఫికెట్లు ముందురోజే సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉదయం పూట సర్టిఫికెట్ల పంపిణీ పూర్తయితే, గ్రామంలో సమస్యలను తెలుసుకొనేందుకు, గ్రామస్తులతో మాట్లాడేందుకు సమయం ఉంటుందని తెలిపారు. ముందుగా ఇచ్చిన షెడ్యూలు ప్రకారం జగనన్న సురక్ష కేంపులను ఏర్పాటు చేయాలని, షెడ్యూలులో ఎటువంటి మార్పులు చేయకూడదని తెలిపారు. ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు కార్యక్రమం నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

జగనన్నకు చెబుదాంకు 117 వినతులు

సమావేశం అనంతరం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత సమస్యలకు పరిష్కారం కోరుతూ 117 అందాయి. కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డిటికి వినతిని అందజేస్తున్న రైతు స ంఘం నాయకులు

పెదంకలాం కాలువ పనులు చేపట్టాలి

తహశీల్దార్‌కు రైతు సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి - బలిజిపేట

పెదంకలాం కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన చేయాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిటి కె.రత్నకుమారికి రైతు సంఘం నాయకులు సోమవారం వినతిని అందజేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి పెదంకలాం పనుల పేరట రైతులను ప్రభుత్వం దగా చేస్తుందని విమర్శించారు. ఆదివారం తాము చేపట్టిన పరిశీలనలో కాలువ పనులు నత్తనడకన సాగుతున్నట్టు గుర్తించామన్నారు. మూడేళ్ల కితం జెకె నిధులు రూ.18కోట్లుతో కాలువ ఇరువైపులా సిమెంట్ ర్యాంపులు, బేస్మెంటు సెట్టర్లు బాగు కోసం కోట్లాది రూపాయలు కేటాయించారు. గత మూడేళు ్లగా ఆనకట్టు హెడ్ దగ్గర ఎటువంటి పనులు చేయలేదన్నారు. అరసాడ వద్ద 600 మీటర్లు ఒక పక్క సిమెంట్ ర్యాంపు మరికొంత దూరం కిలోమీటరు రెండు పక్కల సిమెంట్ ర్యాంపు వేశారు తప్ప ఇంకా ఎటువంటి పనులు చేయలేలేదన్నారు. ఈ ఏడాది వర్షాలు పడక, నీరు లేక నారుమల్లు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాదైనా కాలువలో గండ్లు పూడ్చి, అడ్డుగా ఉన్న గట్లు తొలగించి తక్షణమే కాలువ ద్వారా నీరు విడిచి పెట్టాలని అన్నారు. ఇప్పటికైనా కాలువ పూడిక తీసి ఈ ఖరీఫ్ సీజన్‌కు నీరు అందించాలని, వర్షాల్లేక ఎండిపోతున్న నారుమల్లుకు తక్షణమే కాలువ ద్వారా సాగునీరి వ్వాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు గేదెల జగ్గారావు, భానుమూర్తి, త్రినాధ్, మామిడి సింహాద్రి నాయుడు, యమ్మల మన్మధరావు, చిట్టి నాన్న తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

బకాయి వేతనాలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్

బకాయి వేతనాలు చెల్లించాలని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మూడు నెలల బకాయి వేతనాలు ఇవ్వాలని, మారుమూల గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న గిరిజన మహిళలను ఆదుకోవాలని కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల యూనియన్ నాయకులు విశాలాక్షి, అరుణ, ఇందిరా అన్నారు. సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా గుర్తించి యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అర్హులైన వారిని ఆశాలుగా ప్రమోట్ చేయాలని అన్నారు. 2017 ఏప్రిల్ నుంచి 2019 నవంబర్ వరకు రూ.400 చొప్పున బకాయి వేతనాలు పెండింగ్ ఉందని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ, పార్వతి , కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

స్పందనకు 97 వినతులు

ప్రజాశక్తి - సీతంపేట

ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న పిఒ కల్పనాకుమారి

స్థానిక ఐటిడిఎలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 97 అర్జీలు వచ్చాయి. పిఒ కల్పనాకుమారి ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది. వచ్చిన వినతుల్లో కొన్ని... సన్యాసిపేటకు చెందిన కృష్ణ వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలని కోరారు. కారి గూడకు చెందిన మోహన్ రావు విద్యుత్ ట్రాన్స్ఫారం మార్చాలని కోరారు. ఎగువదుంబంగివలసకు చెందిన మండంగి వెంకటేష్ ఐదు విద్యుత్ స్తంభాలు, వైర్లు మంజూరు చేయాలని కోరారు. లోవగూడ చెందిన ఆదెమ్మ భూమికి అడంగల్ ఇప్పించాలని కోరారు. తుంబలిగూడకు చెందిన కొండగట్టు సుందర్రావు పవర్ వీడర్ ఇప్పించాలని కోరారు. సందిమానుగూడకు చెందిన శాంతి వాటర్ కొళాయి మంజూరు చేయాలని కోరారు. ఓంద్రు జోలకు చెందిన మహేష్ కుమార్ ఐటిడిఎలో పాత షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక రూమ్ అద్దెకు ఇప్పించాలని కోరారు. అనంతగిరికి చెందిన సైన్యాడు కుట్టు మిషన్ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రోషిరెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.సింహాచలం, డిడి శ్రీనివాసరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి, జిసిసి డిఎం సంధ్యారాణి, సిడిపిఒ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

రైతుల బియ్యం సీజ్ చేస్తారా?

ఒడిశా గిరిజనుల ఆగ్రహం

ప్రజాశక్తి- సాలూరు

ఒడిశాలోని పొట్టంగి ప్రాంతానికి చెందిన కొంతమంది గిరిజన రైతులు ధాన్యాన్ని ఆడించడానికి పట్టణంలోని రైస్ మిల్లుకు కొద్దిరోజుల క్రితం తీసుకొచ్చారు. దండిగాం రోడ్డులో ఉన్న రైస్ మిల్లులో ఆడించిన తర్వాత తిరిగి ఆటోల్లో తీసుకుని వెళ్తూ మెయిన్ రోడ్‌లో ఉన్న లక్ష్మీ థియేటర్ వద్ద ఆటోలను నిలిపి ఉంచారు. ఆ ఆటోల్లో ఉన్నవి రేషన్ బియ్యమని ఎవరో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఆ బియ్యాన్ని సీజ్ చేశారు. పొట్టంగి నుంచి ధాన్యాన్ని మిల్లులో ఆడించేందుకు తీసుకొచ్చామని, తాము పండించిన ధాన్యమని గిరిజన రైతులు చెప్పినా పోలీసులు వినలేదు. దీంతో పోలీసులు సీజ్ చేసిన ధాన్యాన్ని సిఎస్ డిటికి అప్పగించారు. దీంతో స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రెవెన్యూ అధికారులు సివిల్ సప్లయ్ గోడౌన్‌లో భద్రపరిచారు. సోమవారం పొట్టంగికి చెందిన గిరిజన రైతులు టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ బియ్యం ఇచ్చేయాలని కోరారు. రెవెన్యూ అధికారులకు అప్పగించామని చెప్పడంతో రైతులు వారిని సంప్రదించారు. స్వాధీనం చేసిన బియ్యం ధాన్యం బియ్యమా, పిడిఎస్ బియ్యమా అనేది నిర్ధారణ కోసం శాంపిల్స్ పంపించామని సిఎస్ డిటి రంగారావు చెప్పారు. ఆ శాంపిల్స్ విశాఖలోని లేబ్‌కు పంపించినట్లు తెలిపారు. ఆ బియ్యం పిడిఎస్ బియ్యం కాకపోతే తిరిగి రైతులకు అందజేస్తామని, ఒకవేళ పిడిఎస్ బియ్యమైతే కేసు నమోదు చేస్తామని చెప్పారు. దీంతో గిరిజన రైతులు వెనుదిరిగారు.

స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై సత్వరంగా చర్యలు చేపడుతున్నామని అదనపు ఎస్‌పి డాక్టర్ ఓ.దిలీప్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యాన నిర్వహించిన స్పందన కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. నేరుగా ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు ఎఎస్‌పి విన్నవించుకోగా, వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఆయన ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ స్పందన కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి బి. నాగేశ్వరరావు, ఎస్‌బి సిఐ ఎన్. శ్రీనివాస రావు, డిసిఆర్‌బి ఎస్‌ఐ వి.పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

5న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 , తరగతుల మిగులు సీట్లకు భర్తీకి ఈ నెల 5న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎ.సుందరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు వారి స్టడీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు పట్టుకొని ఈనెల 5న మోడల్ స్కూల్‌కు హాజరుకావాలన్నారు. పరీక్ష ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

పెద్దాసుపత్రిలో పెద్ద సమస్యలే

- వేధిస్తున్న వైద్యుల కొరత
- చాలీచాలని నర్సింగ్ సిబ్బంది
- ఇబ్బందుల్లో రోగులు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

డివిజన్ కేంద్రమైన పాలకొండ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సమస్యలు కొలువుతీరుతున్నాయి. పేరుకు 100 పడకల ఆస్పత్రి అయినప్పటికీ ఆశించిన స్థాయిలో సేవలందడం లేదు. వైద్యుల కొరత, నర్సింగ్ సిబ్బంది లేమితో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో పూర్తిస్థాయిలో రోగులకు సేవలు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీకి ముఖద్వారంగా ఉన్న ఈ ఆస్పత్రిలో ఒపి విపరీతంగా ఉంది. రోజుకు 200 పైగా కేసులు నమోదవుతున్నాయి. ఐపి కూడా రోజుకు 30 వరకు నమోదవుతుంది. పాలకొండతో పాటు సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాల నుంచి అధిక సంఖ్యలో రోగులు ఇక్కడకు వస్తున్నారు. అలాగే శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం, కొత్తూరు నుంచి, విజయనగరం జిల్లా రేగిడి మండలం నుంచి కూడా రోగులు వస్తున్నారు. దీంతో ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతుంది.

వైద్యులు కొరత....

పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో రోగులకు సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టుతో పాటు ఆర్ఎంఒ పోస్టులు గత కొంత కాలంగా ఖాళీగా ఉన్నాయి. మత్తు వైద్యులు ఇద్దరు అవసరమైనప్పటికీ ఒక్కరే ఉన్నారు. ఆయన కూడా కొద్ది రోజుల నుంచి సెలవులో ఉండడంతో మత్తు వైద్యులేక శస్త్ర చికిత్సలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆర్థోఫిడిక్ వైద్యులు కూడా కొద్ది రోజుల నుంచి సెలవులో ఉండడంతో ఎటువంటి శస్త్ర చికిత్సలు జరగడం లేదు. ఏరియా ఆస్పత్రికి అధిక సంఖ్యలో ఆర్థో కేసులే నమోదవుతున్నాయి.

పాలకొండ ఏరియా ఆస్పత్రి

అయితే సంబంధిత వైద్యులు లేకపోవడంతో రిఫర్ చేయడం అనివార్యమవుతుంది. అదే విధంగా ఎంతో అవసరమైన నర్సింగ్ సిబ్బంది కూడా పూర్తిస్థాయిలో లేరు. 24 మంది నర్సింగ్ సిబ్బంది ఉండాల్సి ఉన్నప్పటికీ 22 పోస్టులు మంజూర య్యాయి. అయితే ఇటీవలే 11 మంది ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. కొత్తగా నలుగురు మాత్రమే ఇక్కడకు వచ్చారు. దీంతో ఏడుగురు నర్సింగ్ సిబ్బంది కొరత ఏర్పడింది.

సమస్యలు కొలువు....

ఆస్పత్రిలో సమస్యల కొలువు తీరుతున్నాయి. ప్రహరీగోడతో పాటు ఆస్పత్రి పరిసరాల్లో రహదారి, కాలువలతో పాటు రోగులకు అవసరమైన లిఫ్ట్ సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదే విధంగా ఆస్పత్రిలో ఉన్న ఒక వార్డు పూర్తిగా పాడైంది. ఈ సమస్యలు పరిష్కరించాల్సి ఉంది.

చర్యలు తీసుకుంటున్నాం

ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి నా వంతు చర్యలు తీసుకుంటున్నాను. చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం. రోగులకు సకాలంలో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాను. వైద్యులు సమయపాలన పాటించేలా చర్యలు చేపడుతున్నాను. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఇప్పటికే స్థానిక ఎంఎల్ఎ కళావతి, ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్‌తో పాటు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ఆస్పత్రి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తాను.

జి.నాగభూషణరావు, సూపరింటిండెంట్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

10,11న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - బెలగాం

తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 10, 11 తేదీల్లో స్థానిక కలెక్టరేట్ వద్ద 36 గంటల పాటు ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.సరళ, జి.జ్యోతిలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తెలంగాణా కంటే అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, వీటితో పాటు కొన్ని ప్రధాన సమస్యలపై ఈ ధర్నా తలపెట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేశ్వరి, గౌరి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, కోశాధికారి జి.వెంకటరమణ పాల్గొన్నారు.

6న ఇంటర్ ప్రవేశాలకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి- సీతంపేట

ఇంటర్మీడియట్ ప్రవేశానికి 6న సీతంపేట బాలుర గురుకుల కళాశాలలో రెండో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ ఎం శ్రీనివాసరావు తెలిపారు. మెరిట్ లిస్ట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

అందుబాటులోకి మహాప్రస్థాన రథం

ప్రజాశక్తి- పాలకొండ

పేదల కోసం ఏర్పాటు చేస్తున్న మహా ప్రస్థాన రథం సిద్ధమైంది. మున్సిపల్ మాజీ ఛైర్మన్ పల్లా కొండలరావు తన సొంత నిధులతో సుమారు రూ.పది లక్షలతో ఆయన తల్లిదండ్రులు కీర్తిశేషులు పల్లా బాబ్జీ, సూరమ్మ దంపతుల జ్ఞాపకార్థం ఈ మహాప్రస్థాన రథం ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. సోమవారం గురు పౌర్ణమిని పురస్కరించుకుని సెగిడి వీదిలో ఉన్న శ్రీ సత్యసాయి శివం మందిరానికి ఈ రథాన్ని అందించారు.

ఘనంగా గురు పౌర్ణమి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని శిరిడి సాయిబాబా గురు పౌర్ణమి మహోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వండువ కత్తుల కవిటి, యు వెంకంపేట, తలవరం, తూడి, చిట్టిపూడి వలస, నడుకూరు గ్రామాలతో పాటు వీరఘట్టంలోని సాయి నగర్, తెలగ వీధి, అంబేద్కర్ జంక్షన్ వద్ద గల శిరిడి సాయిబాబా మందిరాల్లో ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌విఎల్ఎన్ శర్మయాజి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కురుపాం : గురు పౌర్ణమి సందర్భంగా స్థానిక గాయత్రీ ప్రజ్ఞ పీఠంలో 5 కుండీల గాయత్రీ మహా యజ్ఞం, సాయిరాం గుడి వద్ద ప్రత్యేక పూజలు భజన, అన్నసంతర్పణ కార్యక్రమం భక్తులు సోమవారం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో కురుపాం పరిసర ప్రాంతాల గ్రామాలకు చెందిన గాయత్రీ ఆరాధకులు, ప్రజలు యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సాయిరాం గుడి అర్చకులు రాజు పంతులు, రేణుక మాత అర్చకులు ఎన్. సింహాచలం, గాయత్రి యజ్ఞ నిర్వహకులు గురుమూర్తి, శంకరరావు, ఆదినారాయణ, సీర సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పింఛను అందజేత

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

మండలం డోలమడ సచివాలయం పరిధిలో పొట్టి గ్రామానికి చెందిన గౌండేల జోగులు విజయనగరం తిరుమల హాస్పిటల్లో సర్జరీ కారణంగా చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన వాలంటీర్ రవి సోమవారం విజయనగరం వెళ్లి ఆయనకు పింఛను అందించారు. దీంతో ఆయన్ను పలువురు అభినందించారు.

నేడు దశమంతపురంలో 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి- వీరఘట్టం

మండలంలోని దశమంతపురం, చిట్టిపూడి వలస గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నామని ఎంపిడిఒ జి జయంత్ ప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంకాలం ఐదు గంటల వరకు జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందన్నారు. మండల స్థాయి అధికారులతో సమయం పాటించి విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

గరుగుబిల్లిని పాలకొండ సబ్‌స్టేషన్‌లో చేర్చొద్దు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పార్వతీపురం ఎలక్ట్రికల్ సబ్ డివిజన్లో ఉన్న గరుగుబిల్లి మండలాన్ని పాలకొండ ఎలక్ట్రికల్ సబ్ డివిజన్లో చేర్చొద్దని కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు డి.మధుసూదన్ రావు, అరకు పార్లమెంటు నియోజకవర్గ నాయకులు ఎంబి విజయ్ అంకుశం, తదితరులు వినతి పత్రం అందజేశారు.

ధర్మారావు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం మండలం నర్సిపురంలో గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మారావు మృతి చెందిన విషయం తెలిసిందే. ధర్మారావు కుటుంబం చాలా ఆర్థికంగా వెనకబడింది. ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్న కోటిపాం గ్రామ తరపున ఆ కుటుంబానికి సోమవారం రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారు. సర్పంచ్ భర్త సుంకర వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ నగదు బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సహాయం అందజేసిన వారిలో జగ్గారావు, తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న వేమకోటి నరహరిశాస్త్రి

ఘనంగా వ్యాస పాదుకార్చనలు

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

పట్టణ శివారులో గల శ్రీ సూర్య పీఠంలో సోమవారం గురు పౌర్ణమిని పురస్కరించుకుని బ్రహ్మశ్రీ వేమకోటి నరహరిశాస్త్రి ఆధ్వర్యంలో వ్యాస భగవానుని పాదుకార్చనలు, శ్రీభాష్యకారుల వారి పాదుకార్చనలు ఘనంగా నిర్వహించారు. గురుపాదుకార్చన అనంతరం గురుమండల హోమం, భగవద్గీత శ్లోక పారాయణం, విశ్వశాంతి హోమాలు, శ్రీ గురుదత్తాత్రేయ మేధా దక్షిణామూర్తి పాదుకలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ముందుగా గురు మండల మంటప పూజలు చేశారు. సాంస్కృతిక పాఠశాల, సాంస్కృతిక విద్యార్థులకు రూ.10 వేలు చెక్కును నరహర శాస్త్రి, ఉపాధ్యాయులు తిరుమల ఆచార్యులకు అందజేశారు. పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రార్ధన గీతాలను, శ్లోకాలను, పారాయణం చేశారు. కార్యక్రమంలో వేమకోటి వివేకానంద శర్మ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ అవతారంలో నవదుర్గాదేవి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని కొత్తవలసలో ఉన్న నవదుర్గాదేవి ఆలయంలో గల అమ్మవారి విగ్రహానికి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం వంకాయలు, బెండకాయలు, దొండకాయలు, టమాటాలు, బంగాళాదుంపలు, క్యారెట్, దోసకాయ, ఆనపకాయ, బట్టపువ్వు, మామిడి పళ్ళు మొదలగు పలు రకాల కూరగాయలతో శాకంబరీ దేవి అవతారంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు అలంకరించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు హాజరై దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

నవదుర్గాదేవి

కానరాని పాలకమండలి సమావేశాలు

అభివృద్ధికి నోచుకోని గిరిజనం
ఐటిడిఎను నిర్వీర్యం చేస్తున్న పాలకులు

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం ఐటిడిఎ అంటే గిరిజనులకు భరోసా, నమ్మకం రోజురోజుకు సన్నగిల్లుతుంది. ఒకప్పుడు ఐటిడిఎకు వెళ్తే సమస్యలు పరిష్కారమవుతాయని, మన కష్టాలు తీరుతాయని గిరిజనులు ఎంతో ఆశగా ఎదురుచూసేవారు. కానీ నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటైన తర్వాత ఎక్కువ శాతం కార్యక్రమాలు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించడంతో ఐటిడిఎకు ప్రాధాన్యత తగ్గింది. గతంలో వారానికి ఒకసారైనా గిరిజన గ్రామాల్లో పర్యటించి గిరిజనుల కష్టాలు, బాధలను తెలుసుకొనే పిఒ నేడు నెల రోజులకొకసారైనా పర్యటించడం లేదు. గతంలో ఐటిడిఎ అంటే రుణాలు, చెక్ డ్యామ్‌లు, రోడ్లు మంజూరు చేస్తారనే ఆశ ఉండేది. గిరిజన సంక్షేమం కోసం నిరంతరం పనిచేయాల్సిన ఐటిడిఎ అభివృద్ధి కార్యక్రమాలకు పుల్‌స్టాప్ పెట్టిందనే చెప్పవచ్చు. ఇందుకు కారణం కూడా లేకపోలేదని ఐటిడిఎకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావడం లేదని గిరిజన నాయకులు అంటున్నారు. ఐటిడిఎ ద్వారా గిరిజన యువతకు ట్రై కార్ ఉపాధి రుణాలు, పిటిజి (సవర, గదబ) తెగలకు 100 శాతం

పార్వతీపురం ఐటిడిఎ కార్యాలయం

సబ్సిడీతో ఉపాధి రుణాలు ఇచ్చేవారు. ప్రస్తుతం వాటి ఊసే లేదు. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో రోడ్లు మెరుగు పడలేదు. నేటికీ డోలి సాయంతో గిరిజనులు వైద్యం కోసం వస్తున్న పరిస్థితి. తాగునీటి కోసం గిరిజనుల కష్టాలు వర్ణాతీతం. నిరుద్యోగ యువత ఉపాధి శిక్షణకు ఏర్పాటు చేసిన వైటిసి కేంద్రాలు గత నాలుగేళ్లుగా మూతపడ్డాయి. దీంతో గిరిజన అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. 2021 డిసెంబర్ 24 ఒకే ఒకసారి పాలకమండలి సమావేశం నిర్వహించారు.

కానరాని పాలక మండలి సమావేశాలు

45 నెలలుగా పాలక మండలి సమావేశాలు జరగడం లేదు. మన్యం జిల్లాలో గిరిజన మంత్రి, ఎమ్మెల్యేలున్నా గిరిజన అభివృద్ధికి ఎంతవరకు ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఐటిడిఎ పాలన పట్ల నిర్లక్ష్యం నిండుగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో పార్వతీపురం ఐటిడిఎ ఉంటుందా? ఊడుతుందా అనే అనుమానాలు గిరిజనులు వ్యక్తం చేస్తున్నారు.

డోలీపై తీసుకొస్తున్న గిరిజనులు

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

బస్సు యాత్రపై సమీక్ష

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో నిర్వహించబోయే భవిష్యత్తు గ్యారంటీ బస్సు యాత్రపై సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో అరుకు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి సంధ్యారాణి అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈ బస్సు యాత్ర విజయవంతం చేసి టిడిపి అధికారంలోకి వస్తే జరగబోయే లబ్దిని పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కురుపాం, పార్వతీపురం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు తోయక జగదీశ్వరి, బొబ్బిలి చిరంజీవులు, నిమ్మక జయకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - బలిజిపేట

సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన అజ్జాడ సచివాలయం, స్కూల్, అంగన్వాడీ కేంద్రాలను సోమవారం సందర్శించారు. గ్రామంలో ఆరోగ్య పరిస్థితులపై సచివాలయం, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం సీజనల్‌గా వచ్చే జ్వరాలు, తదితర రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. డ్రైడే కార్యక్రమాలను పక్కగా నిర్వహించాలని, దోమల అవాసాలను గుర్తించి సిబ్బంది సమన్వయంతో పని చేసి నివారణా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో అవసరమైన మందులు, పరీక్షలు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత హెల్త్ కార్డులు (ఎన్ సిడి సర్వే) గురించి ఆరా తీశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ రికార్డులు తనిఖీ చేసి, రికార్డుల నిర్వహణ పక్కగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. పిల్లల

సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఐఒ జగన్మోహన్‌రావు

ఆరోగ్యాన్ని పరిశీలించారు. ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పోషకాహారం బాగా తీసుకోవాలని, తద్వారా రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుందని, రక్తహీనత లేకుండా ఉంటారని డిఐఒ అవగాహన కల్పించారు. జ్వరాలు, ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా వెంటనే తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సిహెచ్.జగన్మోహనరావు, వైద్య సిబ్బంది చిన్నమ్మలు, సోనియా, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై ఆర్‌టిసి డ్రైవర్ల వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావును స్థానిక ఆర్టీసి డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యేను కలిసి వారి సమస్యలను విన్నంచారు. అనంతరం ఎమ్మెల్యే నేరుగా ఆర్టీసి డిపోకు వెళ్లి డిపో మేనేజర్, జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అధికారితో కలిసి సమావేశమై డ్రైవర్ల సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేశారు. దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్‌టిసి బస్ డ్రైవర్లు టిన్ యంత్ర పరికరాల సాయంతో టికెట్లను జారీ చేసి మళ్లీ వాళ్ళే డ్రైవింగ్ చేయాలనే ఆర్టీసి అధికారుల నిబంధనల వల్ల నిరక్ష్యరాసులైన డ్రైవర్లు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే ఆర్టీసి అధికారులతో మాట్లాడుతూ డ్రైవర్లకు అవగాహన వచ్చేంత వరకు తర్ఫీదు ఇవ్వాలని, అంతవరకు వారిని జనరల్ లైన్లో నడపాలని కోరారు.

ఆర్‌టిసి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

దీంతో వారు అందుకు అంగీకరించడంతో పాటు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దశల వారీగా డ్రైవర్లందరికీ అవగాహన కల్పించి విధులు అప్పజెబుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, ఆర్టీసి కార్మికుల నాయకులు, కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒలకు ఉపాధ్యాయుల అభినందనలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల విద్యాశాఖాధికారులుగా బాధ్యతలు చేపట్టిన డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావుకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒ-1గా డి.గౌరునాయుడు, ఎంఇఒ-2గా ఆర్.ఆనందరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు వీరికి ఉపాధ్యాయులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఎంఇఒలకు దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.పైడిరాజు, కె.గోవిందరావు, నరహరి, బి.బాబురావు, కె.విజయ్‌కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఇఒగా సింహాచలం బాధ్యతలు

బలిజిపేట: మండల విద్యాశాఖ అధికారి -1గా సామల సింహాచలం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయన స్థానిక ఎంపిడిఒ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. సింహాచలం శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎంగా పనిచేస్తూ బలిజిపేట ఎంఇఒ-1గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సామల మాట్లాడుతూ విద్యాశాఖ పరంగా ప్రభుత్వం అందచేస్తున్న పథకాలను సక్రమంగా అమలు చేసేందుకు, మండలంలో విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్, పిఆర్‌టియు నాయకులు, పలువురు ఉపాధ్యాయులు, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది సామలకు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు.

వీరఘట్టం: ఎంఇఒలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కార్యక్రమంలో ఎంఇఒ-2 కె.శ్రీనివాసరావు, ఎమ్మార్సీ సిబ్బంది భద్ర, సిఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒగా చంద్రశేఖర్

గుమ్మలక్ష్మీపురం: మండల విద్యాశాఖ అధికారిగా బల్లా చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి జిల్లా దేవరాపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్త శుద్ధితో పనిచేస్తానని అన్నారు. తన ఉపాధ్యాయ వత్తి గుమ్మలక్ష్మీపురం మండలం లాడలో ప్రారంభమైందని, ఇక చివరి మజిలీగా గుమ్మలక్ష్మీపురం ఎంఇఒగా రావడం జరిగిందన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షులు హరిప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్ల మరమ్మతులు చేయాలని వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్

రహదారి మరమ్మతులపై కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు సిపిఎం, గిరిజన సంఘం నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు హెచ్.రామారావు మాట్లాడుతూ కొమరాడ మండలంలో గడిచిన అనేక నెలలుగా పార్వతీపురం నుంచి కొమరాడ మీదుగా కూనేరు నుంచి మూడు రాష్ట్రాలకు వెళ్లే అంతరాష్ట్ర రహదారి మార్గంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ఎప్పటికీ అనేకమంది వాహనదారులు ప్రయాణికులు ప్రమాదాలు జరిగి మరణించడంతో పాటు క్షతగాత్రులు అవుతున్నారన్నారు. ఇలాంటి సందర్భంలో మా వంతుగా కొంతవరకు మరమ్మతు పనులు చేసినప్పుడు కూడా పూర్తిస్థాయిలో పనులు జరగకపోవడంతో చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉందన్నారు. కావున వెంటనే ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

బాలేసులో గడపగడపకు..

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని బాలేసు పంచాయతీలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నది లేనిది ఆమె అడిగి తెలుసుకున్నారు. నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలను అమలు చేస్తుందన్నారు. గ్రామంలో గృహ నిర్మాణం, పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు అయినది లేనిది అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దీనమయ్య, జెడ్‌పిటిసి రాధిక, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

నాడు - నేడు కార్యక్రమం కింద మంజూరైన అంగన్వాడీ భవనాల నిర్మాణ, మరమ్మతు పనులను వెంటనే పూర్తిచేయాలని ఐసిడిఎస్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.చిన్మయిదేవి తెలిపారు. సోమవారం స్థానిక సామాజిక భవనంలో జిల్లా పరిధిలో గల సిడిపిఒలు, సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నాడు-నేడు పనులు పురోగతిని సమీక్షించారు. భవనాల నిర్మాణాల పనులను ప్రస్తుతం ఉన్న స్టేజ్ నుండి మూడురోజుల తర్వాత స్టేజికి తీసురావాలన్నారు. ఎంఎస్‌కె విజిట్స్, ఆధార్ లింకేజీ శతశాతం పూర్తి చేయాలన్నారు. గర్భిణులు, మరియు బాలింతలకు జూలై 15 నుంచి అందిస్తున్న టిహెచ్ఆర్ (అంగన్వాడీ కేంద్రాల నుండి సరుకులను ఇంటికి ఇచ్చుట)పై లబ్దిదారులకు ఇంటి వద్ద ఆహారం తినేలా అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీలకు అందిస్తున్న సరకులు బయట మార్కెట్ లోకి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ కె.విజయ గౌరి, జిల్లా పరిధిలో గల సిడిపిఒలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తాగునీటి కోసం

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి - వీరఘట్టం

తమకు రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు రావడం లేదని వీరఘట్టంలోని బాబు జగజ్జీవన్‌రావు కాలనీకి చెందిన మహిళలు సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గతంలో వేసిన పైప్ లైన్లు కిందకు ఉండడం వల్ల పైకి నీరు రాక ఇబ్బందులుపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని మూడు నెలల కిందట ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కోసం పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పనులకు వెళ్లకపోతే పస్తులు, తాగునీరు పట్టుకోకపోతే గొంతు ఎండుతుందని, దీంతో ఏం చేయాలో అర్థం కాని స్థితిలో ఉన్నట్లుఇఒ వి.రామచంద్రరావు వద్ద వాపోయారు. దీనికి ఆయన స్పందిస్తూ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు హామీ ఇవ్వడంతో దళిత మహిళలు వెనుతిరిగారు.

ప్రథమ ప్రాధాన్యత విద్యకే

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-మెంటాడ

విద్యకే ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర తెలిపారు. మెంటాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జగనన్న అమ్మఒడి, విద్యా కానుక నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 17,848 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరినట్లు తెలిపారు. మొదటి విడతలో రూ.8.5 కోట్లతో 30 పాఠశాలల్లో మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా సకల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రెండో విడతలో రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, ఎంఇఒ ఎం.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ రామకృష్ణ, ఎంపిడిఒ త్రివిక్రమరావు, వైస్ ఎంపిపిలు సారికి ఈశ్వరరావు, తెట్టంగి దుర్గ, సర్పంచ్ రేగిడి రాంబాబు, ఎంపిటిసి పతివాడ కుమారి, తదితరులు పాల్గొన్నారు

బాడంగి : బాడంగి హైస్కూల్లో ఎంఇఒ రాజేశ్వరి అధ్యక్షతన మండల స్థాయి అమ్మఒడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మఒడి చెక్కును విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, ఎంపిపి భోగి గౌరి, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి శంకరరావు, హెచ్‌ఎం దత్తి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : జగనన్న అమ్మఒడి పథకం విద్యార్థుల పాలిట కల్పతరువని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస హైస్కూల్లో ఎంఇఒ శ్రీదేవి అధ్యక్షతన అమ్మఒడి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 2022-23 సంవత్సరానికి గాను 5893 మంది విద్యార్థులకు అమ్మఒడి కింద రూ.8.83 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కొప్పలవెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, బొంతల వెంకట్రావు, పిఎస్ఎన్ పాత్రుడు, ఎంఇఒ

మెంటాడ.. అమ్మఒడి చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

బండారు శ్రీనివాసరావు, హెచ్‌ఎం సిహెచ్.ఈశ్వరరావు, పళ్ల భీష్మ, స్కూల్ కమిటీ ఛైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

వార్డెన్‌పై విద్యార్థినుల ఫిర్యాదు

బిసి గర్ల్స్ హాస్టల్ వార్డెన్ దుర్భాషలాడుతూ, దురుసుగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థినులు ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు ఫిర్యాదుచేశారు. అమ్మఒడి కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే స్పందిస్తూ వార్డెన్‌తో మాట్లాడాలని సంబంధిత అధికారులతోపాటు ఎంపిపి గోపమ్మకు సూచించారు. వార్డెన్‌పై చర్యలు తీసుకుంటామని, హాస్టల్లో సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఈ విషయమై వార్డెన్ నీరజ్‌కుమారిని వివరణ కోరగా, ఆడపిల్లలు కావడంతో హాస్టల్ కదలకుండా చేయడం, క్రమశిక్షణలో ఉంచడం చేస్తున్నట్లు తెలిపారు.

వేపాడ : వేపాడ హైస్కూల్లో ఏర్పాటుచేసిన అమ్మఒడి ఉత్సవాల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు విద్యార్థులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యావంతులు కావాలనే ఉద్దేశంతో సిఎం జగన్ పనిచేస్తున్నారని తెలిపార. కార్యక్రమములో ఎంపిపి డి.సత్యవంతుడు, డిసిసిబి ఛైర్మన్ వి.వి.చినరామినాయుడు, జెడ్‌పిటిసి ఎస్.అప్పలనాయుడు, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఎం.కస్తూరి, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్ బి.శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగన్నాథం, ఎం.సత్యనారాయణ, సిహెచ్ పద్మావతి. ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఎంఇఒ బాలభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బాడంగి.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

వేపాడ.. అమ్మఒడి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు